W W W.EPAPER.MAHADAILY.COM

మహా పత్రిక

ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

21-6-2025







## కష్టపడి పనిచేసే వారికే గుర్తింపు

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు పార్టీ గుర్తింపు తగిన పదవులు ఇస్తుందని ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ అన్నారు.

06



07

## కనిపించని చినుకు..!

- అన్నదాతకు కలసిరాని నైరుతి
- ఎండతాకిడికి మొలకెత్తని గింజ
- 50 వేల ఎకరాల విత్తనాలు వేసిన రైతులు.
- భారీగా నష్టపోయిన అన్నదాత



04


## పేదల కలల సాకారం వైపు ఇందిరమ్మ ప్రభుత్వం

- వెంగళరావు సాగర్ ప్రాజెక్టు గిరిజనులకు జీవనాధారం
- గత ప్రభుత్వ పాలకులు వెంగళరావు సాగర్ ప్రాజెక్టు పునరుద్ధరణను విస్మరించారు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

# ఆర్టీసీ ఆదాయ యాత్రకు ఖమ్మం మార్గదర్శి!

## ప్రతి కిలోమీటర్లో ప్రజల విశ్వాసం.. ఆర్టీసీ విజయరహస్యం

- ప్రైవేట్ వాహనాలకు చెక్.. ప్రయాణికుల హక్కులకు టీఎస్ఆర్టీసీ షీల్డ్
- డిపోల గుండెల్లో లాభాల దూకుడు
- మహాలక్ష్మి రూట్‌లో మైలురాళ్లు
- ఆర్టీసీ మార్గదర్శకుడు సరిరామ్



ప్రజల ప్రయాణ భద్రతే లక్ష్యంగా, నష్టాల నుంచి లాభాల వైపు పరుగులు తీస్తున్న తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ - ఖమ్మం రీజియన్‌కి ఇది తిరుగులేని గౌరవ గమనమైంది. సామాన్యుడి నిత్యప్రయాణ మిత్రంగా, సేవామయ సంస్థగా, ప్రజల గమ్యాన్ని సురక్షితంగా చేరవేస్తూ.. ఆర్టీసీ తన సామర్థ్యాన్ని మరింత బలపరుస్తోంది. ప్రయాణికుల సౌకర్యం, ఉద్యోగుల సంక్షేమం, ఆస్తుల పరిరక్షణ, ఆదాయ మార్గాల శోధన వంటి విభిన్న ప్రమాణాల్లో సరికొత్త బాటలు వేసిన ఖమ్మం ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సరిరామ్ నాయకత్వంలో సంస్థ పునరుత్థానం చరిత్రగా నిలుస్తోంది.

07

ఖమ్మం, మహా

# రాజకీయాల్లో యువత పాత్ర ఎంతో కీలకం

## రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ్ రెడ్డి

**ఖమ్మం, జూన్ 20, మహా:** రాజకీయాల్లో యువత పాత్ర ఎంతో కీలకమని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జెక్కిడి శివచరణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజెండ్ల సాయికుమార్ అధ్యక్షతన జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ నుండి మయూరి సెంటర్ లోని రాజీవ్ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, స్వర్గీయ రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం జిల్లా ఎక్స్టెండెడ్ ఎక్స్ క్యూటివ్ సమావేశం సుమారు 300 మంది జిల్లా, అసెంబ్లీ, మండల,కార్యకర్తలతో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. మన పని మనం చేసుకు పోవాలని పార్టీ తన పని తాను చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిపోతే అయినా నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమంలో ఏ మాత్రం రాజీ పడకుండా అనుకున్న విధముగా అన్ని వాగ్దానాలు అమలు చేసుకుంటూ పోతుందని అన్నారు. ప్రతిపక్ష పార్టీ అదే పనిగా కాంగ్రెస్ పై బురద జల్లే ప్రయత్నం చేస్తుందని దాన్ని మనం గ్రామ స్థాయిలో తిప్పి కొట్టాలని ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజెండ్ల సాయికుమార్ మాట్లాడుతూ...రాబోవు లోకల్ బాడీ ఎన్నికల్లో క్రియాశీలక పాత్ర పోషించి



ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు అత్యధిక మెజారిటీ తో గెలుపొందేలా కృషి చేయాలని అన్నారు. సీనియర్ల సలహాలు సూచనలతో నూతన కార్యవర్గం ముందుకు పోతున్నదని ఆయన స్పష్టం చేశారు.ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మారుమూల ప్రాంతాల్లో కి తీసుకెళ్లి పూర్తి స్థాయిలో గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు.రాబోవు ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ పటిష్టంగా ఉన్న దగ్గర యువజన కాంగ్రెస్ కే అత్యధిక సీట్లు వచ్చే విధంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వంతో కొట్లాడదామని అన్నారు. జిల్లాలి ఇంచార్జి దీపక్ ప్రజ్ఞ మాట్లాడుతూ యువత రాజకీయాల్లోకి రావడానికి యువజన కాంగ్రెస్ ఒక ప్లాట్ ఫామ్ వంటిదని అన్నారు. కష్టపడి పని చేసే వారికి పదవులు వాటంతట అవే వస్తాయని అన్నారు. యువజన కాంగ్రెస్ లో కొత్త పాత ఏమీ లేదని ఎవరికీ ఏ సాయం కావాలి అన్నా జిల్లా ఇంచార్జీ గా ఎప్పుడు అందుబాటులో ఉంటానని అన్నారు.ప్రతి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పని చేసి మీరు చేసిన పని గుర్తు పెట్టుకునేలా చేసుకోవాలని అన్నారు. సోషల్ మీడియా ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా చేసిన ప్రతి పని దాని ద్వారా రాష్ట్ర నాయకులు తెలిసే విధముగా సర్క్యులేట్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ కుమార్,జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు యడ్లపల్లి సంతోష్, ఖలీల్ పాషా, బెజ్జం గంగాధర్, భానోత్ కొటేష్, మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కల మహేష్, క్రాంతి,బెల్లంకొండ శరత్,రాధాకృష్ణ, ఉక్తేజ్, భూక్యా భద్రం, కార్తీక్ మరియు అన్ని అసెంబ్లీ నియోజక వర్గ అధ్యక్షులు, మండల అధ్యక్షులు , యువజన కాంగ్రెస్ నాయకులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# జీళ్ళచెరువు గ్రామంలో విద్యుత్ పోల్స్ నిర్మాణం

**కూసుమంచి, జూన్ 20, మహా:** కూసుమంచి మండలం జీళ్ళచెరువు గ్రామంలోని పలు బజార్లలో శుక్రవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో కొత్త విద్యుత్ స్తంభాలను నిర్మాణం చేశారు. జీళ్ళచెరువు గ్రామంలో విద్యుత్ పోల్స్ కావాలని, చాలా బజార్లకు పోల్స్ లేవని, తద్వారా కరెంట్ సమస్య నెలకొందని రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ శాఖ మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. దీంతో తక్షణమే స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జీళ్ళచెరువు గ్రామంలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశించారు. ఈమేరకు జీళ్ళచెరువు గ్రామ పంచాయతీకి మొత్తం 30పోల్స్ కేటాయించిన విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం గ్రామంలోని అన్ని బజార్లలో పోల్స్ ను ఏర్పాటు చేశారు. కాగా డీఈ నాగేశ్వరరావు, ఏడీఈ కోక్యానాయక్, ఏఈ అశోక్ విద్యుత్ పోల్స్ నిర్మాణ పనులను పరిశీలించారు. పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఈ నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాలలో విద్యుత్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా నూతన పోల్స్ ఏర్పాటు చేస్తున్నామని, లూజ్ పోల్స్ ను తొలగించి ఆ ప్రాంతంలో నూతన పోల్స్ ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్ మెన్ కమలాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెండ్ర అంజయ్య, తమ్మబోయిన లక్ష్మయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.



# కొత్త కోర్సులతో మహిళా డిగ్రీ కళాశాల

**ఖమ్మం, జూన్ 20 (మహా):** ఖమ్మం నగరంలోని గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి నూతన శాఖలు ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. రజిత తెలిపారు. ఈ సంవత్సరం నుండి వ్యాపార నిర్వహణ శాస్త్రంలో బ్యాచిలర్ స్థాయి కోర్సును ప్రవేశపెట్టినట్లు ఆమె పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ విద్యలో కనీసం నలభై శాతం మార్కులు సాధించిన విద్యార్థినిలెవరైనా, ఏ శాఖ నుండి చదివిన వారైనా ఈ కోర్సులో ప్రవేశానికి అర్హులని తెలిపారు. ఇప్పటికే కళాశాలలో రాజకీయ శాస్త్రం, వాణిజ్యశాఖ (సాధారణ వాణిజ్యం, కంప్యూటర్ వాణిజ్యం), భౌతిక శాస్త్ర విభాగం (గణితం-భౌతికశాస్త్రం-రసాయనశాస్త్రం, గణితం-భౌతికశాస్త్రం-కంప్యూటర్ శాస్త్రం, గణితం-గణనశాస్త్రం-గణాంక శాస్త్రం), జీవశాస్త్ర విభాగం (జీవశాస్త్రం-రసాయనశాస్త్రం-వనస్పతిశాస్త్రం, జీవశాస్త్రం-రసాయనశాస్త్రం-కంప్యూటర్ శాస్త్రం, వృక్షశాస్త్రం-జీవశాస్త్రం-రసాయనశాస్త్రం) వంటి విభాగాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. విద్యార్థినులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని, ఈ నెల ఇరవై ఐదవ తేదీలోపు అభ్యర్థిత్వ నమోదు చేసుకుని, కళాశాలలో ప్రవేశం తీసుకోవాలని ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం ప్రాంతీయ సమన్వయ అధికారి అరుణ కుమారి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. రజిత సూచించారు.



# కొత్తగూడెం ఏరియా జిఎం కార్యాలయంలో యోగా దినోత్సవం

**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 20 (మహా):** జూన్ 20, 2025 న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వం మరియు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు కోల్ ఇండియా అనుబంధ బొగ్గు సంస్థలలో ఈ నెల 14 నుండి 20 వరకు కొత్తగూడెం ఏరియాలోని అన్ని మైన్స్ మరియు డిపార్ట్మెంట్లలో యోగ బూట్ క్యాంపలను నిర్వహిస్తున్నారు. ఈ యోగ బూట్ క్యాంపుల్లో భాగంగా శుక్రవారం కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని సిబ్బందితో యోగ బూట్ క్యాంప్ నిర్వహించారు.ఈ యోగ శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్



ఎం.షాలేం రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ఏరియా జిఎం మాట్లాడుతూ, ఈ యోగ క్యాంప్ నిర్వహణ యొక్క ముఖ్య ఉద్దేశం ఉద్యోగుల ఆరోగ్యపరమైన శ్రేయస్సు దృష్ట్యా రూపొందించబడ్డ ఈ శిక్షణా శిబిరాలు శారీరక-మానసిక ప్రశాంతతకు, దృఢత్వాన్ని పెంపొందించడానికి తోడ్పడుతుందని, సంస్థ ఉద్యోగుల శ్రేయస్సును పెంపొందిస్తూ, ఆరోగ్య వంతమైన వాతావరణాన్ని కల్పించడమే సంస్థ యొక్క ప్రధాన లక్ష్యమని అన్నారు, ఉద్యోగులం దరూ యోగ ప్రాముఖ్యత తెలుసు కొని వారి యొక్క రోజువారి కార్యక్రమాలలో కొంత సమయ మును యోగాకు కేటాయించి వారి ఆరోగ్యాలను కాపాడుకోవాలని ఉద్యోగులకు తెలియజేశారు. "యోగా అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాక, మానసిక స్థిరత్వాన్ని కలిగించే సాధనం. ఇది ఉద్యోగుల్లో ఒత్తిడిని తగ్గించి, ఏకాగ్రతను పెంపొందించి, పనితీరును మెరుగుపరుస్తుందన్నారు.

# కోటి రూపాయల చెక్కును అందజేసిన జిల్లా

**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 20 (మహా)** ఇటీవల రోడ్డు ప్రమాదం లో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ కానిస్టేబుల్ టి.అనిల్ కుమార్ కుటుంబానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు కోటి రూపాయల చెక్కును జిల్లా ఎస్పీ రోహిత్ రాజు చేతుల మీదుగా అందజేశారు. పోలీస్ శాలరీ ప్యాకేజీ అకౌంట్ ద్వారా యూనిఫాం సర్వీస్ కష్టమర్ల సంక్షేమానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు ప్రవేశపెట్టిన స్కీం ద్వారా వచ్చిన నగదును అనిల్ కుమార్ కుటుంబానికి శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ ఎం.సత్యనారాయణ,చీఫ్ మేనేజర్ ఆంజనేయ రమేష్ మరియు బ్రాంచ్ మేనేజర్ వెంకటేశ్వర్లు సమక్షంలో ఎస్పీ చేతుల మీదుగా ఈ చెక్కును అందజేశారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేశానికి సేవ చేస్తున్న ధైర్యవంతులైన సిబ్బందికి మరియు వారి కుటుంబాలకు ఆర్థిక రక్షణ కల్పించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన ఈ స్కీం పోలీస్ శాఖలోని ప్రతి ఉద్యోగికి చాలా ప్రయోజనకరమని ఈ సందర్భంగా ఎస్ బి ఐబ్యాంకు వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.



03
FOLLOW: @ANNTELUGU
21-6-2025
WWW.EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

# అర్హత కలిగిన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు తక్షణమే మంజూరు చేయాలి



**కొత్తగూడెం, జూన్ 20(మహా):** ఈనెల 23న కొత్తగూడెం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేయనున్నట్లు కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి తెలిపారు. కొత్తగూడెం ప్రజల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. బీఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు ఈ నిరసన చేపడుతున్నట్లు చెప్పారు. కొత్తగూడెంలో అర్హులైన నిరుపేదలకు వెంటనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించాలన్నారు. రోడ్డు పక్కన పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి, డ్రైనేజీలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని చెప్పారు. వర్షపు నీరు నిలిచిన చోట బ్లీచింగ్ చల్లి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని వెల్లడించారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్ లో వేయాలన్నారు. జూన్ 20వ తేదీ దాటిన కొత్తగూడెంలో ఎక్కడ కూడా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టిన దాఖలాలు లేవన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ హరితహారం పథకాన్ని ఓ దీక్షలాగా చేపట్టారని గుర్తు చేశారు. పరిసరాల పరిరక్షణతో పాటు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ప్రభుత్వానికి సూచన చేశారు.

# మాదకద్రవ్య రహిత సమాజమే లక్ష్యం





**ఖమ్మం క్రైమ్, మహా:** మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య గారు అన్నారు. "అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినం" సందర్భంగా హైదరాబాదు నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో పోలీస్ అధికారులతో తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య గారు మాట్లాడుతూ.. నషా ముక్త్ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో ప్రతీ ఏడాది జూన్ 26వ తేదీన నిర్వహించే అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని జూన్ 20 నుంచి 26 వరకు వారం రోజుల పాటు రాష్ట్ర, జిల్లాల స్థాయిల్లో అవగాహన కార్యక్రమాలు, మాదక ద్రవ్య రహిత జీవనం కోసం యువతను, విద్యార్థులకు భాగం కల్పించడం, యోగా, ధ్యాన కార్యక్రమాలు, ర్యాలీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సెమినార్లు, వర్క్ షాప్ లు, ప్రతిజ్ఞా కార్యక్రమాలు, చిత్రలేఖన పోటీ, వ్యాసరచన పోటీలు, సైకిల్/ బైక్ ర్యాలీలు వంటి కార్యక్రమాలునిర్వహించేందుకు తగు చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. ప్రస్తుత పరిస్థితులలో మాదకద్రవ్యాల దుర్వినియోగం, దానివల్ల కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరికీ సమగ్ర అవగాహన అవసరమని అన్నారు . విద్యాలయంలో డ్రగ్స్ రహిత వాతావరణాన్ని నెలకొల్పడానికి తమ సహకారం ఎల్లవేళలా అందజేయాలని తెలిపారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం అనేది వ్యక్తిగతంగానే కాకుండా కుటుంబం, సమాజం మరియు దేశం పైన కూడా ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తుందని అన్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన స్వేచ్ఛను విద్యార్థులు దుర్వినియోగం చేసుకోకుండా నైతిక విలువలు, సరైన జీవన శైలిని అలవర్చుకొని ఉజ్వల భవిష్యత్తుకు,విద్య పురోగతి వైపు చైతన్యవంతం కావాలని విద్యార్థులకు సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని ఖమ్మం పోలీస్ కమిషనరేట్ లో తీసుకుంటున్న కార్యక్రమాలు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ లా%డ%ఆర్డర్ ప్రసాద్ రావు ,సిఐ స్వామి పాల్గొన్నారు.

# జగన్ ఖబడ్దార్



**ఖమ్మం క్రైమ్ మహా:** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పల్నాడు జిల్లాలో వైఎస్ఆర్‌సీపీ నాయకుడి కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం కమ్మ సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని చేసిన వ్యాఖ్యలను టీపీసీసీ స్టేట్ కోఆర్డినేటర్లు వాసిరెడ్డి నరేష్, వింజం సతీష్ లు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు వారు శుక్రవారం మహా క్రైమ్ ప్రతినిధితో మాట్లాడుతూ జగన్ చేసినటు వంటి వ్యాఖ్యలను సవరించు కోవాలన్నారు. జగన్‌ను బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయనకు హితవు పలికారు. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పల్నాడులో ఆత్మహత్య చేసుకున్న తన పార్టీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన సందర్భాన్ని రాజకీయంగా దుర్వినియోగం చేస్తూ, కమ్మ సామాజిక వర్గాన్ని అవమానించేలా, అపహాస్యం చేసేలా వ్యాఖ్యలు చేయడం అత్యంత బాధాకరం అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు సామాజిక సామరస్యాన్ని దెబ్బతీస్తాయి, వర్గాల మధ్య విభేదాలను రెచ్చగొడతాయని భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతమైతే, పరిణామాలు తీవ్రంగా ఉంటాయని జగన్‌ను హెచ్చరిస్తున్నామని అన్నారు.

# దళితులపై అగ్రవర్ణాల మూకుమ్మడిదాడి దుర్మార్గచర్య




**ఖమ్మం సిటీ, మహా:** దళితులపై అగ్రవర్ణాల మూకుమ్మడిదాడి దుర్మార్గచర్య అని, దాడిచేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసి కఠినంగా శిక్షించాలని మాదిగహక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు కొరిపల్లి శ్రీనివాస్, మాదిగ జేఏసి రాష్ట్ర ఉపాధ్యక్షులు మట్టె గురుమూర్తి డిమాండ్ చేశారు. ఖమ్మం ప్రెస్క్లబ్లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కామేపల్లి మండలం పింజరమడుగు గ్రామంలో మాదిగ కులానికి చెందిన పేదలైన చిప్పలపల్లి అచ్చయ్య, పిచ్చయ్య అన్నదమ్ములకు 12.30ఎకరాల ఇనాం భూమిని ఇచ్చారు. అందులో కొంత భూమి అమ్ముకోవడం, కొంత ఆక్రమణకు గురికావడం జరిగిందని వారు ఆరోపించారు. అందులో చిప్పలపల్లి శ్రీనివాసరావు తన తండ్రికి ఇచ్చిన 34 కుంటల భూమిని జూన్ 14న ఉదయం 10గంటల సమయంలో బాగుచేసుకుంటుండగా మాదిగోడా మా భూముల పక్కన నీకు భూమి ఎక్కడుందిరా అంటూ పేరుతో నానా భూతులు తిడుతూ.. కులం తక్కువ నా కొడుకుల్లారా అంటూ అగ్రకులానికి చెందిన దమ్మాలపాటి సత్యం, దమ్మాలపాటి అచ్చయ్య, దమ్మాలపాటి చిన్న వెంకన్న, గుజ్జలపూడి రాంబాబు, పంతంగి శ్రీను, వంకాయలపాటి సత్తమయ్య, శివరాత్రి రామారావు, పంతంగి పార్వతి లు చిప్పలపల్లి శ్రీనివాసరావుపై గడ్డపార, కర్రలతో దాడిచేసి కాలు ఇరగ్గొట్టారన్నారు. శ్రీనివాసరావు భయంతో ఇతరుల సాయంలో స్థానిక కామేపల్లి పోలీస్ స్టేషన్లో మధ్యాహ్నం ఫిర్యాదుచేసిన పట్టించుకోలేదన్నారు. సాయంత్రం 6గంటల సమయంలో శ్రీనివాసరావు తమ్ముడు ఆటో డ్రైవర్ చిప్పలపల్లి ఆనందరావును కొట్టారు. మరలా ఫిర్యాదుచేసిన పోలీసులు పట్టించుకోలేదన్నారు. మరుసటి రోజు జూన్ 15న మా వాళ్ళను ఎందుకు కొట్టారని అడిగినందుకు రేణుక, లక్ష్మి, ఈశ్వరమ్మ లను కూడా విచక్షణారహితంగా కర్రలతో మూకుమ్మడిగా దాడిచేస్తూ నానాబూతులు తిట్టుకుంటూ కొట్టారని బాధితులు ఆవేదనను వ్యక్తంచేశారు. జిల్లా అధికారులు విచారణచేసి దాడిచేసి గాయపరిచిన వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసి కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో ఎస్సీ ఉపకులాల జేఏసి తెలంగాణ అధ్యక్షులు గవరవరపు దేవిడ్ రాజు, దండోరా జిల్లా అధ్యక్షులు దుప్పెల్లి శ్రీను, ఆర్పిఐ పార్టీ రాష్ట్ర నాయకులు నకిరికంటి సంజీవరావు, పరిశాల వెంకన్న, కొండ వెంకన్న, చర్మకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇటికల లత, బాధితులు పాల్గొన్నారు.

# పోలీస్ అధికారిని అభినందించిన కమిషనర్



**ఖమ్మం క్రైమ్, మహా:** ఖమ్మం పోలీస్ కమిషనరేట్ లోని పలు పోలీస్ స్టేషన్లలో వివిధ హోదాలలో భాధ్యతలు నిర్వహించి... అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ (ఏఎస్సై) గా భాధ్యతలు నిర్వహిస్తూ.. (ఎస్సై) సబ్ ఇన్స్పెక్టర్ గా పదోన్నతి పొంది భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీ పై వెళ్తున్న యం. సూర్యనారాయణ, యం.కమలాన్ బేగ్ , విఆర్ రాఘవయ్య ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

# నేడు 7 గ్రామాలకు విద్యుత్ సరఫరాకు నిలిపివేత



**కూసుమంచి,మహా:** కూసుమంచి మండలంలోని పాలేరు టౌన్ ఫీడర్ పరిధిలో ఆరు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ బి.తావుర్యా శు క్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలేరు సబ్ స్టేషన్ లోని 33/11కేవీ లైన్స్ మరమ్మత్తుల చేయాల్సి ఉండగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అందుకు గాను శనివారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు పాలేరు, జుజ్జుల్రావుపేట, మల్లాయిగూడెం, నాయకన్ గూడెం, హట్యతండా, భోజ్యతండా, వాల్యతండాలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు.

# పేదల కలల సాకారం వైపు ఇందిరమ్మ ప్రభుత్వం

## వెంగళరావు సాగర్ పునరుద్ధరణకు 33 కోట్లు

- వెంగళరావు సాగర్ ప్రాజెక్టు గిరిజనులకు జీవనాధారం
- గత ప్రభుత్వ పాలకులు వెంగళరావు సాగర్ ప్రాజెక్టు పునరుద్ధరణను విస్మరించారు
- రైతుల సంక్షేమానికి ఇందిరమ్మ ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది
- అశ్వరావుపేట నియోజకవర్గం పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 20 (మహా):** పేదల కలలను సాకారం చేసే దిశగా ఇందిరమ్మ ప్రభుత్వం పయనిస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారం మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం అశ్వరావుపేట నియోజకవర్గం లోని చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మరియు ములకలపల్లి మండలాల్లో విస్తృతంగా పర్యటించి ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ మరియు పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామ సహాయం రఘురామిరెడ్డి, అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మరియు భద్రాచలం ఐటిడిఏ పిఓ రాహుల్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా చంద్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామంలో 130 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా నునావత్ పార్వతి ఇందిరమ్మ,ఇంటి పనులకు మంత్రి భూమిపూజ నిర్వహించారు. అనంతరం తిప్పనపల్లి గ్రామంలో కోటి 70 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్ల పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అన్నపురెడ్డిపల్లి మండలం మర్రిగూడెం గ్రామంలో 34 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా అట్ల లక్ష్మి ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ నిర్వహించారు. ములకలపల్లి మండలం మాదారం గ్రామంలో 24 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా పుష్పలత ఇందిరమ్మ ఇంటి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ పర్యటనలో భాగంగా మొత్తం ఐదు హై లెవెల్ బ్రిడ్జి పనులు చంద్రుగొండ మండలం సీతాయి గూడెం 2/కి. మీ వద్ద 3.20 కోట్లు, అన్నపురెడ్డిపల్లి మండలం కంపగూడెం గ్రామం 1/0 కి. మీ వద్ద 3.25 కోట్లు, ములకలపల్లి మండలం చింతలపాడు 3/4 కి. మి వద్ద 2.10 కోట్లు మరియు ములకలపల్లి మండలం పాతూరు గ్రామం 0/400 కి. మి వద్ద 1.60 కోట్ల వ్యయంతో చేపట్టనున్న హై లెవెల్ బ్రిడ్జ్ పనులకు మంత్రి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రతి పేదవాడి సొంతింటి కల సహకారం చేసేందుకు గాను మొదటి విడతలో



నాలుగున్నర లక్షల ఇళ్లను మంజూరు చేశామన్నారు. దీనిలో భాగంగా అశ్వరావుపేట నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయగా ఈ గిరిజన ప్రాంతానికి 1000 అదనపు ఇందిరమ్మ ఇండ్లను కూడా మంజూరు చేయడం జరిగిందన్నారు. తిప్పనపల్లి గ్రామంలో 130 ఇండ్లు మంజూరు అయ్యాయని అందులో 75 పైగా ఇళ్ల నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతుందని, మిగిలిన ఇండ్ల నిర్మాణం కూడా వేగవంతంగా చేపట్టాలని లబ్ధిదారులను మంత్రి కోరారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కూడా త్వరలో ప్రారంభించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు దశలవారీగా ప్రతి సోమవారం నిధులను విడుదల చేయడం జరుగుతుందన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో 17 వేల కోట్లు రుణమాఫీ చేయగా, ప్రస్తుత ప్రభుత్వం 10 నెలల్లోనే 21 వేల కోట్ల రూపాయలను రైతులకు మాఫీ చేసిందన్నారు. రైతు భరోసా పథకం కింద ఇటీవల తొమ్మిది రోజుల్లోనే తొమ్మిది వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాలో జమ చేసినట్లు మంత్రి చెప్పారు. పేదల సంక్షేమానికై ఉచిత విద్యుత్, 500 కే గ్యాస్, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలతో పేదల సంక్షేమానికి పెద్దపీట ఈ ఇందిరమ్మ ప్రభుత్వం వేస్తుందని అన్నారు. చంద్రుగొండ మండలంలోని వెంగళరావు సాగర్ ప్రాజెక్టు పునరుద్ధరణకు 33 కోట్లు మంజూరు చేసినట్లు ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు. అశ్వరావుపేట నియోజకవర్గ పర్యటనలో భాగంగా మంత్రి వెంగళరావు సాగర్ ప్రాజెక్ట్ పునర్నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ప్రాజెక్టు మరమ్మత్తులు, సర్క్యులర్ బీచ్ నిర్మాణం తదితర పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. 2019 వరదల్లో తీవ్రంగా దెబ్బతిన్న ఈ ప్రాజెక్టు సమస్యను గత ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఈ ప్రాంత రైతులకు వెంగళరావు సాగర్ ప్రాజెక్టు జీవనాధారం అని అన్నారు. గత ప్రభుత్వానికి ఈ గిరిజన ప్రాంతం ఇందులోని పంట పొలాలు కనిపించలేదని, పెద్ద పెద్ద ప్రాజెక్టులు వైపే చూసింది కానీ, కనీసం ఆలోచన లేకుండా వెంగళరావు ప్రాజెక్ట్ మరమ్మతులకు నిధులు ఇవ్వలేదని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మరియు స్థానిక శాసనసభ్యులు జారే ఆదినారాయణ కృషితో ఈ ప్రాజెక్టుకు జీవం పోసే ప్రయత్నం జరుగుతుందన్నారు. ఈ పర్యటనలో హౌసింగ్ పిడి శంకర్, పంచాయతీరాజ్ ఈ ఈ శ్రీనివాసరావు, ఆర్ అండ్ బి ఈ ఈ వెంకటేశ్వరరావు మరియు జిల్లా అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

## అభివృద్ధి చూసి ఓర్వలేక అక్కసును వెళ్ళబోస్తున్న బిఆర్ఎస్ నాయకులు



**మధిర, మహా:** మధిర నియోజకవర్గం అభివృద్ధి చెందుతూ ఉంటే దాన్ని చూసి ఓర్వలేక కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పై, తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారిపై నిందలు వేయటమే పనిగా బిఆర్ఎస్ నాయకులు వ్యవహరిస్తున్నారని మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ అన్నారు. అబద్దాలు చెప్పి అధికారం లోకి వచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నారు .... మైనారిటీ లకు 12% రిజర్వేషన్ ఇస్తాం అని, నిరుద్యోగ భృతి, డబల్ బెడ్రూమ్ ఇల్లు ఇలా చెప్పుకుంటే పోతే చాలా వున్నాయి 10సంవత్సరాలు అధికారం లో ఉండి ప్రజలకు నేరవేర్చింది ఏమి లేదు.. కానీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారం చెప్పట్టిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు, ఉచిత కరెంటు, రైతు రుణమాఫీ, రైతు బంధు, 500 లకే గ్యాస్ ఇలా 6 గ్యారంటీలను అమలు చేస్తుంది. ఇందిరమ్మ ఇల్లు రాజీవ్ యువ వికాసం పథకాలు అమలు చేయబోతుంది. ఎన్టీఆర్ ప్రేమన లేక కేటీర్ అని పలకబోయి ఎన్టీఆర్ అన్నారా, ఎన్టీఆర్ మీద మీకు ఇప్పుడు ప్రేమ పుట్టుకు వచ్చిందా, అధికారంలో ఉన్నప్పుడు ఎన్టీఆర్ పేరు పలకటం చేతకాని మీరు ఈరోజు ఎన్టీఆర్ పేరు సూచించడం హాస్యాస్పదంగా ఉంది అన్నారు.

## ప్రయివేటు బడుల ఫీజు దోపిడి అరికట్టాలి



**కారేపల్లి, మహా :** కార్పొరేట్, ప్రైవేట్ బడులలో ఫీజుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడి చేస్తున్నాయని పీడీఎస్‌యూజిల్లా నాయకులు అశోక్, కార్తిక్‌లు విమర్శించారు. కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టి,అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని పీడీఎస్‌యూ అధ్వర్యంలో శుక్రవారం కారేపల్లి మండల విద్యాశాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈసంధర్భంగా పీడీఎస్‌యూ నాయకులు మాట్లాడుతూ పేద విద్యార్థులు విద్యానభ్యసిస్తున్న ప్రభుత్వ బడులను బలోపేతం చేయకుండా నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. ప్రైవేట్, కార్పొ రేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నియమ, నిబంధన లను ఉల్లంఘిస్తూ పుట్టగొడుగుల్ల బ్రాంచీల పుట్టుకొస్తున్నాయన్నారు. ఈ– టెక్నో, ఐఐటి, ఒలింపియాడ్ పేర్లతో అధిక ఫీజులతో విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, టై, షూ పాఠశాలలోనే అమ్ముతూ పరోక్ష దోపిడికి పాల్పడుతున్న ప్రభుత్వం శోద్యం చూస్తుందన్నారు. అనుమతి లేకుండా నిర్వహిస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకొని యెడల పిడిఎస్‌యూ అధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పివైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌వీ.రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి



**కారేపల్లి, మహా :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కారేపల్లి ఎంపీడీవో సురేందర్ ఆదేశించారు. శు క్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ, వర్షాకాలం రావడంతో ఇండ్ల పనులు వేగవంతంగా చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించాలన్నారు. ఇళ్ల నిర్మాణ పనుల సమయంలో ప్రభుత్వ చూసిన మేరకే ఇసుక కూపనులు అందజేయాలన్నారు. ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉన్నందున సంబంధిత ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, వెలుగు సీసీలు, స్థానిక పంచాయతీ కార్యదర్శులు అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఎం కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## ఎంపీ వద్దిరాజు పార్లమెంటరీ సంఘం సమావేశానికి హాజరు

**ఖమ్మం, మహా:** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పెట్రోలియం, సహజవాయువు శాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం సమావేశానికి హాజరయ్యారు.స్థాయీ సంఘం నాలుగు రోజుల అధ్యయన యాత్ర కర్ణాటకలోని మంగళూరులో శుక్రవారం ప్రారంభమైంది,ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ఛైర్మన్ సునీల్ తర్కరే అధ్యక్షత వహించారు.పెట్రోలియం,సహజ వాయువు ఉత్పత్తులు,వాటి ధరలు,వినియోగదారులకు అందుతున్న సేవలు,వాటి డిమాండ్,మరింత మెరుగైన,సత్వర సేవలు అందించేందుకు తీసుకుంటున్న, చేపట్టవలసిన చర్యలు,ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి సమావేశంలో చర్చించారు.

## తిరుమలాపాలెం మండల ప్రెస్ క్లబ్ ఏర్పాటు



**తిరుమలాయపాలెం, మహా :** ఘనంగా ప్రెస్ క్లబ్ పరిచయ వేదిక మండలంలోని ప్రభుత్వ మండలం పరిధిలోని కేశవపురం క్రాస్ రోడ్ వద్ద అనుష గార్డెన్స్ లో ఇటీవల ఎన్నికైన నూతన ప్రెస్ క్లబ్ కమిటీ పరిచయ వేదిక ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, విశిష్ట అతిధులు, జానపద గేయాల మధ్యన మండల ప్రెస్ క్లబ్ ప్రధాన అధ్యక్షుడు పసలాది సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత విధి నిర్వహణలో అమరులైన జర్నలిస్టులు కాంతారావు,దొనేపల్లి వెంకన్నకు మౌనం పాటిస్తూ నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సిలార్ సాహెబ్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా జర్నలిస్టు లు పనిచేయా ల్సిన బాధ్యత ఉందన్నారు. నిజాన్ని నిర్భయంగా వెలికి తీసే జర్న లిస్టులకు ఎప్పుడు తమ మద్దతు ఉంటుందని ఆయన అన్నారు. ప్రెస్ క్లబ్ కమిటీకి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగాఎస్సై కూచిపూడి జగదీష్ వ్యవసాయ అధికారి సీతారామరెడ్డి మాట్లాడారు. నూతన అధ్యక్షులు పసలాది సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలోని ప్రతి ఒక్క జర్నలిస్టు ఐకమత్యంగా ఉండాలని ఉద్దేశంతోనే ప్రెస్ క్లబ్ కమిటీని ఏర్పాటు చేశామని అన్నారు. అలాగే తిరుమలయపాలెం మండల జర్నలిస్టులకు నివాస స్థలాలు ఇవ్వాలని, ప్రెస్ క్లబ్ కి కార్యాలయ భవనంకూడా ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ సూర్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బెల్లం శ్రీనివాస్,బీఆర్ఎస్ మండల నాయకులు కొప్పుల ఉపేందర్ రెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంతా డివిజన్ నాయకులు కమ్మ కోమటి నాగేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్, తెలుగుదేశం జిల్లా నాయకులు కొండబాల కరుణాకర్, మదర్ సాహెబ్ చారిటబుల్ ట్రస్ట్ ఎండి సయ్యద్ ఇమామ్, మాజీ ఎంపీపీలు కొప్పుల అశోక్, బోడ మంగీలాల్, మార్కెట్ కమిటీ సభ్యులు జడల నాగేశ్వరరావు, పాలేరు డివిజన్ ఆత్మ కమిటీ సభ్యులు ఉప్పునూతల నాగేశ్వరరావు, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు ఆలస్య నాగేశ్వరరావు, భాగ్యలక్ష్మి కాటన్ మిల్ మేనేజర్ కృష్ణమూర్తి, ప్రెస్ క్లబ్ పరిచయ వేదికకు సహాయక సహకారాలు అందించిన భానోత్ రవి పాల్గొన్నారు.

## ఛాంపియన్ షిప్ సాదించిన టీంను అభినంధించిన జనరల్ మేనేజర్(పర్సనల్) కిరణ్ కుమార్



**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 20 (మహా):** కోల్ ఇండియా స్థాయిలో ఈ నెల 10 నుండి 12 వరకు మహానది కోల్ ఫీల్డ్స్(ఎంసిఎల్) ఆధ్వర్యంలో బసుంధర ఏరియాలో జరిగిన కోల్ ఇండియా ఇంటర్ కంపనీ చెస్ టోర్నమెంట్ లో టిమ్ ఛాంపియన్ షిప్ సాదించిన టిమ్ మేనేజర్ కమ్యూనికేషన్ ఆఫీసర్ టి.శ్రీనివాస రావు మరియు క్రీడకారులైన కే.శివ కుమార్, కే.రామ్ లక్ష్మణ్ రెడ్డి లను జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ శాలువాతో ఘనంగా సన్మానించి ట్రోఫీని మరియు ప్రసంశా పత్రాలను అందించి వారిని అభినంధించారు. ఈ కార్యక్రమంలో జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ తో పాటు , డిజిఎం(పర్సనల్) లు కేసా నారాయణ రావు, బి.శివ కేశవ రావు, ముకుంద సత్యనారాయణ, కమ్యూనికేషన్ ఆఫీసర్ టి.శ్రీనివాస రావు, సీనియర్ పిఓ(పిఎం వింగ్) కే.శ్రీనివాస్, క్రీడకారులు కే.శివ కుమార్, కే.రామ్ లక్ష్మణ్ రెడ్డి, వెల్ఫేర్ పిఏ కే.వర ప్రసాద్, సేవా కొ-ఆర్డినేటర్ ఇజాజ్ షరీఫ్ పాల్గొన్నారు.

## పేదలకు అండగా ఇందిరమ్మ ప్రభుత్వ పాలన



**తల్లాడ, మహా:** పేదలకు అండగా ఇందిరమ్మ ప్రభుత్వ పాలన సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రివర్యులు, తల్లాడ మండలం నారాయణపురం గ్రామంలో 5 కోట్ల 50 లక్షలతో నిర్మించిన రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రజల దీవేనెలతో రాష్ట్రంలో సంవత్సరంన్నర క్రితం ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, తల్లాడ- నారాయణ పురం- కొడవటిమెట్ట గ్రామాలను కలిపి 5 కోట్ల 50 లక్షలతో రోడ్డు నిర్మించామని అన్నారు. గత పాలకులు అమలు చేసిన పథకాలను కొనసాగిస్తూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అన్నారు. అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను పేదలకు చిత్తశుద్ధితో అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఇ యాకోబ్, ఇఇ తానేశ్వర్, కల్లూరు ఆర్డీఓ ఎల్. రాజేందర్, పెనుబల్లి డిఇ ఎండి. ఖలీల్ అహ్మద్, తహసీల్దార్, ఎంపీడీఓ, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ శుభ్రంగా ఉంచుకోవాలి

- ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి
- విధులకు సకాలంలో హాజరు కావాలి
- ఏఐ టూల్స్ వంటి ఆధునిక సాంకేతికతను అధికారులు అంది పుచ్చుకోవాలి
- కలెక్టరేట్ రెవెన్యూ సిబ్బంది పని తీరుపై వివిధ సెక్షన్ల అధికారులు, సిబ్బందితో సమీక్షించిన కలెక్టర్
- సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు ఫైల్స్ క్లియర్ చేయాలి
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం, మహా:** అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు ఫైల్స్ క్లియర్ చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి కలెక్టరేట్ రెవెన్యూ సిబ్బంది పని తీరుపై వివిధ సెక్షన్ల అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ కలెక్టరేట్ లో పని చేసే సిబ్బంది మొత్తం ఒక బృందంగా పని చేస్తేనే మంచి ఫలితాలు వస్తాయని, ప్రజలకు, అధికారులకు మంచి వారధిగా సిబ్బంది పని చేయాలని అన్నారు. సోమవారం వచ్చే ప్రజావాణి దరఖాస్తులు, ముఖ్యమంత్రి కార్యాలయం, మంత్రుల దగ్గర నుంచి వచ్చే ప్రజావాణి దరఖాస్తులు నెలల తరబడి పెండింగ్ పెట్టడానికి వీలు లేదని, మన పరిధిలో సమస్య పరిష్కారం ఐతే వెంటనే చేయాలని, లేని పక్షంలో సంబంధిత కారణాలు తెలుపుతూ ఫైల్ క్లోజ్ చేయాలని, లబ్దిదారునికి ఎందుకు ఆ పని చేయలేక పోతున్నామో కారణాలతో కూడిన లేఖ రాయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి శాఖ తమ పరిధిలో పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్ పై రెగ్యులర్ గా సమీక్షలు నిర్వహించాలని అన్నారు. సమస్యలను పరిష్కరించే ధోరణితో అధికారులు,సిబ్బంది పని చేయాలని అన్నారు. కలెక్టరేట్ లో ఆఫీస్ సబార్డినేట్ నుంచి సూపరింటెండెంట్ వరకు అధికారులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని, సకాలంలో కార్యాలయానికి హాజరు కావాలని, అనుమతి తీసుకుని మాత్రమే సెలవుపై వెళ్లాలని అన్నారు. కలెక్టరేట్ లో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత కల్పించాలని, కలెక్టర్ టాయిలెట్ ఎంత నీట్ గా మెయింటైన్ చేస్తామో పబ్లిక్ టాయిలెట్స్ కూడాను అలాగే మెయింటైన్ చేయాలని, టాయిలెట్స్ ఎవరు ఎప్పుడు క్లీన్ చేయాలో సిబ్బంది షెడ్యూల్ తయారు చేయాలని అన్నారు. కలెక్టరేట్ లో త్రాగునీటి సరఫరా ఇబ్బందులు రాకుండా చూడాలని అన్నారు. ఖమ్మం జిల్లాలో ప్రోటోకాల్ పకడ్బందీగా అమలు చేయాలని, సీఎం, మంత్రుల మీటింగ్, పబ్లిక్ ప్రోగ్రాం, జిల్లా స్థాయి సమీక్షలకు పాటించాల్సిన ప్రోటోకాల్, ఫుడ్, ఆహ్వానం, సౌండ్, మినీట్స్ తయారు చేయడంపై స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ తయారు చేసి, ప్రతి అధికారికి వారి వారి బాధ్యతలు అప్పగించాలని అన్నారు. జిల్లా పరిపాలనలో ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ ను ఉపయోగించి సులువుగా పనులు ఏ విధంగా పూర్తి చేయగలుగు తామో వివరిస్తూ అధికారులకు త్వరలోనే వర్క్ షాప్ ఏర్పాటు చేస్తామని, భవిష్యత్తు లో ఏఐ టూల్స్ చాలా కీలక పాత్ర పోషిస్తాయని, ఆధునిక సాంకేతికతను అధికారులు అందిపుచ్చుకో వాలని కలెక్టర్ సూచించారు. అనంతరం కలెక్టరేట్ విభాగాలకు చెందిన సెక్షన్ ఇంచార్జి లను పరిచయం చేసుకుని వారు నిర్వహిస్తున్న విధులపై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో డిఆర్వో ఏ. పద్మ శ్రీ, కలెక్టరేట్ లోని వివిధ విభాగాల సూపరింటెండెంట్ లు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సమగ్రాభివృద్ధి తుమ్మల లక్ష్యం



**ఖమ్మం, మహా:** సమగ్ర అభివృద్ధి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లక్ష్యమని ఖమ్మం నగరపాలక సంస్థ మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. తుమ్మల చొరవతో ఎన్నడూ లేని విధంగా జిల్లాలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్రావు సూచన మేరకు ఖమ్మం నగరంలో కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణి శుక్రవారం 29,30,33,34,35,36,47 డివిజన్లో జరిగింది. కార్యక్రమంల్లో ఆమె మాట్లాడుతూ పనుల ఒత్తిడి కారణంగా రాష్ట్ర మంత్రి తుమ్మల కార్యక్రమాలకు రావడం కుదరక తమను కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేయాల్సిందిగా సూచించారని ఆమె తెలిపారు. ఖమ్మం నగరంలో పలు అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిధులు మంజూరు చేయించారని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.



# కష్టపడి పనిచేసే వారికే గుర్తింపు

## వైరా ఎమ్మెల్యే రామదాస్ నాయక్

**వైరా, మహా:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు పార్టీ గుర్తింపు తగిన పదవులు ఇస్తుందని ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ అన్నారు . వైరా నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర పిసిసి ప్రధాన కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన నూతిసత్యనారాయణకు గౌడ సంఘం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు .

ఈ సందర్భంగా వైరా అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వైరా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్ వి ఎస్ గార్డెన్ లో జరిగిన

అభినందన సభ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాసు నాయక్ రాష్ట్ర హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొని పీసీసీ ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ ను ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ రాష్ట్ర హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సారథ్యంలో రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తుందని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని కోరారు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నాయకత్వంలో పీసీసీ ప్రధాన కార్యదర్శిగా నూతి సత్యనారాయణ ను నియమించటం అభినందనీయమని అన్నారు భట్టి విక్రమార్క పాదయాత్రలో నూతి సత్యనారాయణ ప్రముఖ పాత్ర వహించి పాదయాత్రను విజయవంతం చేశారని సత్యనారాయణ ను అభినందించారుఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ , రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, మున్సిపల్ కార్పొరేషన్ డెవలప్మెంట్ చైర్మన్ నరసింహ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకట నర్సిరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు, మొహమ్మద్ జావేద్, మాజీ మార్క్ ఫైడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, దొడ్డ పుల్లయ్య, పిసిసి మెంబర్, కొనిజర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు వడ్డే నారాయణరావు, బొళ్ళ గంగారావు, పమ్మి అశోక్, మచ్చ బుజ్జి, మట్టూరి వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ నంబూరు కనదుర్గ, ఏన్కూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు, స్వర్ణ నరేందర్, దర్నా రాజశేఖర్, కోసూరి శ్రీను, దర్జీ చెన్నారావు, మరికంటి దేడి కుమారి, జిల్లా కిసాన్ అధ్యక్షులు మొక్క శేఖర్ గౌడ్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, తదితరులు పాల్గొన్నారు....

# మత్కేపల్లి గ్రామానికి మహర్దశ

**చింతకాని, జూన్20(మహా):** మత్కేపల్లి గ్రామం ఒకప్పుడు రాత్రిపూట మెయిన్ రోడ్డు నుండి గ్రామంలోకి వెళ్లడానికి కూడా భయపడే పరిస్థితి. నేడు అదే మత్కేపల్లి అభివృద్ధికి మారుపేరుగా నిలుస్తోంది. గతంలో మారుమూలంగా భావించబడిన ఈ గ్రామం, నేడు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారి ప్రత్యేక దృష్టితో అభివృద్ధి మార్గంలో దూసుకెళ్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో చింతకాని మండల పరిధిలో భట్టి విక్రమార్కకి రెండో అత్యధిక మెజార్టీ ఇచ్చిన గ్రామంగా మత్కేపల్లి గుర్తింపు పొందింది. ఈ ప్రజల మద్దతును గుర్తించిన భట్టి విక్రమార్క , గ్రామ అభివృద్ధిని తమ బాధ్యతగా తీసుకొని అనేక మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. చుట్టూ అభివృద్ధి వలయం –నాలుగు వైపుల బీటీ రహదారులు ప్రస్తుతం మత్కేపల్లి నుండి నాలుగు ముఖ్య గ్రామాల దిశగా బీటీ రోడ్లు వేగంగా నిర్మితమవుతున్నాయి.

## కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు అండగా ఉంటా

**చుంచుపల్లి,మహా:** కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు అండగా నిలుస్తానని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. శుక్రవారం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలంలోని నందాతండా, ధన్ బాద్, గౌతంపూర్, రుద్రంపూర్, పెనగడప గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశాలకు హాజరయ్యారు. మాజీ జెడ్పి చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఆళ్ల మురళి, పెదబాబు, జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్ తదితర కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎంపీ మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో పార్టీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు.

## రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం దరఖాస్తుల ఆహ్వానం

**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 20 (మహా):** దేశంలోనే ప్రతిష్టాత్మక సివిల్ సర్వీసెస్ పరీక్షకు సన్నద్ధమవుతున్న తెలంగాణ ప్రాంత అభ్యర్థులకు ఆర్థిక ప్రతిబంధకాలను తొలగించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు



సూచనతో సింగరేణి కాలరీస్ రూపొందించిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకాన్ని ఈ ఏడాది కూడా కొనసాగిస్తున్నట్లు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ శుక్రవారం పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఇటీవల విడుదలై సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన తెలంగాణ ప్రాంత అభ్యర్థులకు రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం కింద ఒక్కొక్కరికి లక్ష రూపాయల నగదు ప్రోత్సాహకాన్ని అందించేందుకు ఈ నెల 23వ తేదీ నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సింగరేణి సంస్థ సీఎండీ బలరాం ఒక ప్రకటనలో తెలియజేశారు. సివిల్స్ ప్రిలిమ్స్ లో ఉత్తీర్ణులైన సింగరేణి కార్మికుల పిల్లలకు కూడా రూ.లక్ష చొప్పున ఆర్థిక ప్రోత్సాహకం అందించనున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది కూడా వీలైనంత ఎక్కువ మంది సివిల్స్ లో విజయం సాధించి రాష్ట్రానికి, దేశానికి సేవ చేస్తారన్న విశ్వాసంతో అర్హులైన తెలంగాణ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. అభ్యర్థులు సింగరేణి వెబ్ సైట్ %షుషు.ంఎశ్రీఎఱఅవం.ఏశీఎ% ను సందర్శించి ఆన్ లైన్ లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సివిల్స్ మెయిన్స్ పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థులకు ఇది ఒక గొప్ప అవకాశమని దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి


**ఖమ్మం సిటీ, మహా:** జిల్లాలో ఉన్న కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టి,అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని మరియు ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థుల (పిడిఎస్యు) అధ్వర్యంలో కారేపల్లి మండల విద్యాశాఖ అధికారి గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ



సందర్భంగా పిడిఎస్యు జిల్లా నాయకులు అశోక్ కార్తీక్ లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులు చదువుతున్న ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి కి అనుగుణంగా విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడం లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలం అయింది అన్నారు.ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యార్థులకు సరిపడా బుక్స్ యూనిఫార్మ్స్ అందించాలన్నారు. మరోవైపు జిల్లా లో ప్రైవేట్, కార్పొ రేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నియమ, నిబంధన లను ఉల్లంఘిస్తు అనుమతులు లేకుండా కార్పొరేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్ల అనేక బ్రాంచీల పేరిట పుట్టుకొస్తున్నాయని అన్నారు. ఈ– టెక్నో, ఐఐటి,ఒలింపియాడ్ లాంటి తదితర పేర్లతో అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయని అన్నారు.

## తుపాకి బొమ్మతో చిన్నారి ఆట

**ఖమ్మం, మహా:** మహబూబాబాద్ జిల్లా పాత పోచారం గ్రామానికి చెందిన మూడేళ్ల చిన్నారి పి. షన్ముఖ్ గత ఏడాది జరిగిన ఓ చిన్న ప్రమాదం వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో ఏడాది పాటు నరకయాతన అనుభవించాడు. ఆటలో భాగంగా ప్లాస్టిక్ తుపాకీతో ఆడుతున్న సమయంలో జరిగిన ఈ సంఘటన, బాలుడి జీవితం మొత్తం మారుస్తుందని ఎవ్వరికీ ఊహకాలేదు. ఆ ఆట వస్తువు నుంచి బయటపడిన ఓ ప్లాస్టిక్ బుల్లెట్ బాలుడి గొంతులో ఇరుక్కుపోవడం వల్ల తీవ్ర నొప్పి, ఆహారం మింగలేని స్థితికి చేరిపోయాడు. తల్లిదండ్రులు బాలుడిని పలువురు డాక్టర్లకు చూపించారు. అయినా సరైన సమస్య ఏంటన్నది ఎవ్వరూ గుర్తించలేకపోయారు. దీని వల్ల బాలుడు శ్వాస తీసుకోవడంలో కూడా ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. ఈనెల 18న ఖమ్మంలోని ప్రముఖ ఈఎన్టీ నిపుణుడు డాక్టర్ ఎంజీవీ ప్రవీణ్‌ను సంప్రదించగా, ఆయన బాలుడిని పూర్తిగా పరీక్షించి, ఎండోస్కోపీ ద్వారా గొంతులో కాకుండా ముక్కు అంగిటి భాగం నుంచి కపాలం వైపు ఏదో పదార్థం ఉన్నట్లు గుర్తించారు. అనంతరం సీటీ స్కాన్ చేసి చూస్తే అది ప్లాస్టిక్ బుల్లెట్ అని తేలింది. ఈ బుల్లెట్ సుమారు ఒక సంవత్సరం పాటు అక్కడే ఉండిపోయింది. దాంతో, దాని చుట్టూ శరీర కణజాలం పెరిగి, దాన్ని పూర్తిగా కప్పేయడం వల్ల బయటపడటం మరింత క్లిష్టంగా మారింది. అయితే డాక్టర్ ప్రవీణ్ తన అనుభవంతో, అపూర్వ నైపుణ్యంతో రెండు గంటలపాటు సజీవంగా శస్త్రచికిత్స చేసి, ఆ బుల్లెట్‌ను కాపాలం నుంచి తొలగించగలిగారు. ఈ ప్లాస్టిక్ బుల్లెట్ ఇంకా కొద్దిసేపు అక్కడే ఉంటే, మెదడుకు రక్త సరఫరా చేసే కీలక నాళాలకు ప్రమాదం వాటిల్లే ప్రమాదం ఉందని డాక్టర్ స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్ పూర్తయ్యాక బాలుడు కాస్త కుదుటపడిన తర్వాత రెండు రోజులపాటు వైద్య పరిశీలనలో ఉంచారు. ఆ తర్వాత అతను పూర్తిగా కోలుకొని ఇంటికి వెళ్ళాడు. తమ కుమారుడి ప్రాణాలను కాపాడిన డాక్టర్ ప్రవీణ్‌కు బాలుడి తల్లిదండ్రులు, బంధువులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. చిన్నారి జీవితాన్ని మళ్లీ వెలుగులోకి తీసుకువచ్చిన డాక్టర్ సేవలను ప్రశంసిస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్ ఒక విలువైన సూచన చేశారు. చిన్నారులు ఆడుకునే సమయంలో తల్లిదండ్రులు వారిని పర్యవేక్షిస్తూ ఉండాలని, చిన్నచిన్న ఆటపాటల్లో కూడా ప్రమాదాలు దాగివుండే అవకాశం ఉన్నందున అలర్ట్‌గా ఉండాలని చెప్పారు. ఈ ఘటన తల్లిదండ్రులకు ఒక హెచ్చరికే కాదు, వైద్య రంగంలో వున్న అద్భుతమైన నైపుణ్యానికి, పట్టుదలకు నిలువెత్తు ఉదాహరణ. ఒక చిన్నారి నొప్పిని గమనించి, క్లిష్టమైన శస్త్రచికిత్స ద్వారా అతడికి జీవం పంచిన డాక్టర్ ప్రవీణ్ నిపుణత్వానికి ఖమ్మం ప్రజలంతా అభినందనలు చెబుతున్నారు.



# కనిపించని చినుకు!

**ఖమ్మం, మహా:** అన్నదాత ఆశలని నైరుతి రుతుపవనాలు చిద్రం చేశాయి. ఒక్క వాన కురిస్తే ఊపిరి తీసుకోగలమన్న ఆశతో పొలాల్లోకి నడిచిన రైతన్న ఇప్పుడు తన తల పట్టుకుంటున్నాడు. విత్తిన మొలక చనిపోతే అది విత్తనపు నష్టం మాత్రమే కాదు ఆ రైతుకి కలలు చలి తాకినట్లే. ఇంట్లో భార్య ఆహారానికి ఎదురుచూస్తుంటే, పొలంలో భూమి తాగే నీళ్లు లేవు. పిల్లల చదువుకు తీసుకున్న అప్పు ఈసారి విత్తనాలపై వేసుకున్నాడు. ఆ ఆశే ఇప్పుడు ఎండకు మరిగిపోతున్న మొలకలతో కలిసి అడుగడుగునా చచ్చిపోతోంది. ఇది వానల కోసం కంటతడి పెట్టే మట్టి మనిషి బాధ. ఇది వ్యవసాయం కాదు మన జీవన ధార. అతడు చల్లగా పడే చినుకును ఆశిస్తున్నాడు, గడ్డి పరక కూడా మోసే మొలకను చూసి నవ్వాలనుకుంటున్నాడు. కానీ ఆకాశం మాత్రం ఉదాసీనంగా ఉంది. వానలు ఆలస్యం కావడం విత్తనాల మీద కాదు మనిషి మీదే అత్యాచారం. ఖమ్మం రైతు కన్నీటి కథ ఇది. విత్తనాన్ని విత్తిన రైతు ఇప్పుడు ఆశలే కోల్పోతున్న విత్తనం అయిపోతున్నాడు. ఖమ్మం జిల్లా లో వానకాలం ప్రారంభమై పక్షం దాటినా వర్షపు చినుకు లేకపోవడం అన్నదాతలకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది మే నెలాఖరులోనే నైరుతీ రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకినట్లు వాతావరణ శాఖ ప్రకటించడంతో, రైతులు ఆశతో వ్యవసాయ పనులు ప్రారంభించారు. సాధారణం కంటే ఎక్కువ వర్షాలు పడతాయని అధికారుల హామీలు కూడా రైతులను స్ఫూర్తితో నింపాయి. కానీ ఆ రుతుపవనాల ప్రభావం నామమాత్రంగా మాత్రమే కనిపించింది. మే నెలలో కొద్ది వర్షాలు కురవగానే పత్తి, వరి, పెసర వంటి పంటలకు విత్తనాలు వేసిన రైతులు ఇప్పుడు ఆ మొలకలు ఎండిపోతుండడంతో తీవ్ర ఇబ్బందులు



పడుతున్నారు. రుతుపవనాలు తాకినట్టు పేర్కొన్నామృగశిర కార్తె ముగిసినదాకా కూడా జిల్లాలో చక్కగా వాన పడలేదు. ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు సుమారు 47,551 ఎకరాల్లో సాగు పూర్తయింది. వీటిలో పత్తి – 23,236 ఎకరాలు, జీలుగ –24,538 ఎకరాలు, పెసర – 1,351 ఎకరాలు, వరినారుమళ్లు – 7,191 ఎకరాలు ఉన్నాయని అధికార గణాంకాలు తెలిపాయి. అయితే ఇప్పుడే మొలకలు ఎండిపోవడం మొదలవడంతో రైతులు బోరు నీటితో తడిపే ప్రయత్నాలు చేస్తున్నా, అది సరిపడక దుస్థితి ఎదురవుతోంది. రైతులు మరలా విత్తనాలు తెచ్చి మళ్ళీ విత్తే ఖర్చు పెరుగుతుంది. పైగా మొలకల వృద్ధి మళ్లీ ఆలస్యం అవుతుంది. ప్రభుత్వం ప్రకటించిన భరోసా నిధులు వచ్చినా కూడా రైతులు వాటిని ఖర్చులకు ఉపయోగించాల్సిన పరిస్థితి. ఇటీవల మూడు రోజుల్లోనే మరో 20 ఎకరాల్లో విత్తనాలు వేసినట్లు అధికారులు పేర్కొనగా, అక్కడ కూడా అదే పరిస్థితి దృష్టికి వస్తోంది. కొన్ని చోట్ల మొలకలు వచ్చినా వేడి తాళలేక అవి కుంగిపోతున్నాయి. ఈ వానకాలం అసలు వస్తుందా? అధికారుల ఊహలు, వాతావరణ శాఖ నివేదికలు తప్పేలా కనిపిస్తున్నాయి. ఇది ఇప్పుడే రైతుల ఆశలను అడ్డుకుంటే వచ్చే రోజుల్లో పరిస్థితి మరింత కష్టతరమవుతుందన్నదే భయం. ఎప్పటికైనా వర్షం పడకపోతే... మొలకలు చనిపోయిన ప్రాంతాల్లో పునర్విత్తనంతో పాటు ఖర్చు, కూలీల ఖర్చుతో పాటు అప్పుల భారం పెరిగే ప్రమాదం ఉంది. ఈ వానల ఆలస్యం కేవలం విత్తనాలు నాశనమే కాకుండా, రైతు మనోబలాన్ని కూడా తీవ్రంగా దెబ్బతీస్తోంది. అధికారుల ముందస్తు ప్రకటనలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు... కనీసం వర్షానికి కేరింతలాలికే రోజు ఎప్పుడు వస్తుందా అని ఆకాశం వైపు చూస్తూ ఎదురు చూస్తున్నారు.

# ఆర్టీసీ ఆదాయ యాత్రకు ‘ఖమ్మం’ మార్గదర్శి!

**ఖమ్మం, మహా:** ప్రజల ప్రయాణ భద్రతే లక్ష్యంగా, నష్టాల నుంచి లాభాల వైపు పరుగులు తీస్తున్న తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ %–% ఖమ్మం రీజియన్‌కి ఇది తిరుగులేని గౌరవ గమనమైంది. సామాన్యుడి నిత్యప్రయాణ మిత్రంగా, సేవామయ సంస్థగా, ప్రజల గమ్యాన్ని సురక్షితంగా చేరవేస్తూ.. ఆర్టీసీ తన సామర్థ్యాన్ని మరింత బలపరుస్తోంది. ప్రయాణికుల సౌకర్యం, ఉద్యోగుల సంక్షేమం, ఆస్తుల పరిరక్షణ, ఆదాయ మార్గాల శోధన వంటి విభిన్న ప్రమాణాల్లో సరికొత్త బాటలు వేసిన ఖమ్మం ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సరిరామ్ నాయకత్వంలో సంస్థ పునరుత్థానం చరిత్రగా నిలుస్తోంది. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్‌ఆర్టీసీ) ప్రయాణికుల విశ్వాసాన్ని అందిపుచ్చుకుంటూ, ఖమ్మం రీజియన్‌లో అనేక రంగాల్లో అభివృద్ధి బాటలో నడుస్తోంది. జిల్లాలోని 7 డిపోల పరిధిలో 659 బస్సులు రోజూ 2.40 లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తూ, సుమారు 1.40 కోట్ల ఆదాయం సంపాదించడం ఈ ప్రగతికి నిదర్శనం.

### దూరప్రాంతాల పయనం - విశ్వాసంతో నిండిన బస్సులు

హైదరాబాద్, బెంగళూరు, రాజమండ్రి, వైజాగ్, తిరుపతి లాంటి ప్రాంతాలకు బస్సులను నడుపుతూ ప్రయాణికుల అవసరాలను తీర్చడంలో ఖమ్మం ఆర్టీసీ ముందు నిలుస్తోంది. రద్దీకి అనుగుణంగా అదనపు సర్వీసులు ఏర్పాటు చేయడంతో ప్రజల నుంచి ఆదరణ వెల్లువెత్తుతోంది.

### నష్టాల నుంచి లాభాలవైపు - కార్యాచరణే ఆయుధం

కరోనా అనంతరం ఆర్టీసీ తీవ్రంగా నష్టాలు చవిచూసినా, ఖమ్మం రీజనల్ మేనేజర్ సరిరామ్ ప్రణాళికాత్మకంగా ముందడుగు వేసి ఆదాయ మార్గాలను విస్తరించారు. ముఖ్యంగా అరుణాచలానికి, పంచారామాలకు ప్రత్యేక



బస్సులు నడపడం, ఖాళీ స్థలాల్లో షాపుల ఏర్పాటుతో ఆదాయం పొందడం వంటి చర్యలు ఫలవంతమయ్యాయి.

### కబ్జాదారులకు బ్రేక్ - ఆస్తుల పరిరక్షణలో చొరవ

భద్రాచలం, కొత్తగూడెం బస్టాండ్లలో ఉన్న ఆర్టీసీ స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నించిన వారిపై చర్యలు తీసుకోవడం, ప్రైవేటు వాహనాల ద్వారా ప్రయాణికులను అక్రమంగా ఎక్కించడాన్ని అడ్డుకోవడం వంటి చర్యల ద్వారా సంస్థ ఆదాయానికి భద్రత కల్పించారు.

### ఉద్యోగుల సంక్షేమం ఆంతరంగా ఆర్థిక ఉత్సాహం

కండక్టర్, డ్రైవర్ ఉద్యోగులకు ఎడీసీ ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లను సమయానికి అందించడం ద్వారా ఉద్యోగుల నిబద్ధతను పెంచారు. ముఖ్యంగా తుఫాను కారణంగా ఇళ్లను కోల్పోయిన 100 కుటుంబాలకు అండగా నిలిచిన విధానం సమాజానికి తలమానికం.

### మహాలక్ష్మి పథకం - మహిళా ప్రయాణికులకు మరింత నమ్మకం

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని ఖమ్మం జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడంతో మహిళా ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణం అందింది. దీంతో ఆర్టీసీపై మరింత విశ్వాసం నెలకొంది.

### రాజకీయ, పరిపాలనా స్థాయిలో ప్రశంసలు

మధిర బస్టాండ్ శంకుస్థాపనను ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా చేయించడం, రవాణా శాఖ మంత్రి సొంతంగా మన్ననలు తెలిపిన సందర్భాలు సరిరామ్ నాయకత్వాన్ని చాటుతున్నాయి.

### ఆర్టీసీ పునరుద్ధానం ప్రయాణికుల తోడ్పాటు అవసరం

“ప్రయాణికుల భద్రతే మా బాధ్యత, సంస్థ లాభాల బాటలో సాగేందుకు అందరూ కలసి కృషి చేయాలి” అని రీజనల్ మేనేజర్ సరిరామ్ తెలిపారు. ప్రజల సహకారంతో సంస్థ మరింత ముందుకెళ్లే అవకాశాలు ప్రబలంగా కనిపిస్తున్నాయి.